

జాబ్ మేళాలో 10 మంది ఎంపిక

ప్రజాశక్తి- మండపేట


మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కోడేన్‌కాషా ఎడ్యుకేటెక్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో పది మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారికి మూడు నెలలు జీతంతో కూడిన శిక్షణ ఇస్తారు. అనంతరం వారికి ఏడాదికి రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షల వేతనం చెల్లించేలా ఉద్యోగాలు కల్పిస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారని ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి.శ్రీనివాసరావు తెలిపారు. ఇలాంటి సదావకాశం తమ కాలేజీ విద్యార్థులకు డిగ్రీ అవ్వగానే వచ్చినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగులు, కాలేజీ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఆగని అక్రమ ఇసుక తవ్వకాలు

- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- ఇప్పటికే పలుప్రాంతాల్లో భారీ ఎత్తున ఇసుక డంప్
- ర్యాంపుల్లో పర్యటనలకే పరిమితమైన అధికార యంత్రాంగం

ప్రజాశకి- రామచంద్రపురం, కడియం

రాష్ట్రంలో అక్రమ ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని సాక్షాత్తు సుప్రీంకోర్టు ఆదేశించినా అది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. కె.గంగవరం మండలంలోని కుడుపూరు వద్ద, వేమగిరి, జొన్నాడతో పాటు పలు ప్రాంతాల్లో రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. యంత్రాలతో తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. గతంలో పలు మార్లు అక్రమ తవ్వకాలపై 'ప్రజాశక్తి' కథనాలు ప్రచురించింది. మైనింగ్ శాఖ అనుమతులు ఉన్నాయంటూ అధికారులు పట్టించుకోలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో కె.గంగవరం మండలం బట్లపాలిక, మసకపల్లి గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని అదేనెల 5న స్పందన కార్యక్రమంలో కోట గ్రామానికి చెందిన కోటిపల్లి వెంకట సుబ్రహ్మణ్య ఈశ్వరరావు కలెక్టర్ కి ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అక్రమ రవాణా ఆగలేదు. అప్పటి నుంచి అక్రమ ఇసుక రవాణా జరుగుతూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ శాఖతో ఇచ్చిన అనుమతులతో జిల్లా అధికారులు మండలాధికారులు దీనిపై అంతగా పట్టించుకోకపోవడంతో నాలుగు నెలలుగా అక్రమ ఇసుక రవాణా పగలు రాత్రి తేడా లేకుండా నేటికీ కొనసాగుతోంది. గతవారం సుప్రీంకోర్టు దీనిపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి అక్రమ ఇసుక రవాణాను వెంటనే నిలిపివేయాలని తెలిపింది. అయితే అక్రమార్కులు సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం పక్కనబెట్టి ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా తరలించేశారు. సుప్రీంకోర్టు మళ్లీ దీనిపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నాలుగు రోజుల్లోగా అక్రమ ఇసుక ర్యాంపులు నిలిపివేయాలని కలెక్టర్‌తో కూడిన కమిటీ వేసి దీనిపై పర్యవేక్షణ కొనసాగించాలని సుప్రీంకోర్టు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఇది ఎంతవరకు అమలవుతుందో అనేది వేచి చూడాలి.



వేమగిరి ప్రాంతంలో డంప్ చేసిన ఇసుక



వేమగిరి ర్యాంపు ఆఫీసు వద్ద పార్క్ చేసిన యంత్రాలు

మరోవైపు యానాం నుంచి రావులపాలెం వరకు గోదావరి ఏటిగట్టు రహదారిలో ఇసుక లారీల రాకపోకలతో ఏటి గట్టు రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. దీంతో ప్రయాణికులు ఏటిగట్టు రోడ్డుపై వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్ని ఫిర్యాదులు వచ్చిన అక్రమ ఇసుక రవాణాపై కానీ, అక్రమ ఇసుక ర్యాంపు నిర్వహిస్తున్న గుత్తేదారులపనై గాని నేటికీ ఎటువంటి చర్యలూ లేవు. యంత్రాలతో తవ్వకాలు నిర్వహించరాదని ఆదేశాలున్నప్పటికీ అమలు కావట్లేదు. అధికారుల సహకారంతోనే ఇదంతా జరుగుతుందనే వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.అక్రమ ఇసుక రవాణాకు అడ్డు పడవలసిన అధికారులే గుత్తేదారులకు పూర్తి సహకారం అందిస్తూ విమర్శలకు గురవుతున్నారు.

సుప్రీంకోర్టు అక్రమ ఇసుక తవ్వకాలు, తరలింపును తక్షణమే నిలుపుదల చేయాలని కలెక్టర్‌కి ఆదేశాలు ఇవ్వడంతో ఈసారైనా జిల్లా అధికారులు కోర్టు ఆదేశాలు అమలు చేస్తారో లేదో అనేది వేచి చూడాలి.

రాష్ట్రంలోని ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్‌జిటి ఫిర్యాదుతో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కొరడా ఝులిపించే వరకు తవ్వకాలు యథేచ్ఛగా సాగాయి. ఫిబ్రవరి 20న జాతీయ హరిత ట్రిబ్యునల్ సభ్యుల బృందం స్థానిక కలెక్టర్‌తో కలిసి కడియం మండలంలోని బుర్రిలంక - వేమగిరి ఇసుక ర్యాంపులో జరుగుతున్న తవ్వకాలను పరిశీలించింది. ఇక్కడ జరుగుతున్న తవ్వకాలపై ఎటువంటి సమాచారం వెల్లడించకుండా వెళ్లిపోయింది. వారు వెళ్లిన మరుక్షణం తమకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ పదుల సంఖ్యలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు మొదలుపెట్టారు. అయితే ఈ అక్రమ ఇసుక తవ్వకాలపై ఏ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. తమకు ఎటువంటి అధికారం లేదంటూ కొందరు, తమ పరిధి కాదంటూ ఇంకొందరు, అసలు విషయం తమకు తెలీదంటూ చెప్పుకొచ్చారు. ప్రతిరోజూ రాత్రి పగలు తేడా లేకుండా కోట్లాది రూపాయల విలువ చేసే వందలాది లారీలతో ఇసుకను తరలించుకుపోయారు. దీనిపై శుక్రవారం బుర్రిలంక ఇసుక ర్యాంపును పరిశీలించగా ఇసుక ఎగుమతులకు ఉపయోగించే భారీ యంత్రాలు ఏటుగట్టు లోపల ర్యాంపు నిర్వాహకుల కార్యాలయం వద్ద ఉండగా ఇసుక ఎగుమతితో ఉన్న ఓ భారీ లారీ ఇసుక ర్యాంపులోనే ఉంది. దీన్ని బట్టి పరిశీలిస్తే ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు శుక్రవారం ఉదయం వరకు ఇసుకను యథేచ్ఛగా తరలించిన ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి.

అలాగే ఇసుక అక్రమార్కులు ముందుచూపుతో ఏటుగట్టు సమీపాన (పట్టా భూముల్లో) కోట్లాది రూపాయలు విలువ చేసే లక్షలాది క్యూబిక్ మీటర్ల ఇసుకను నిలువ చేసి సప్తగిరులకు సవాల్ విసురుతున్నారు. ఈ అక్రమ తవ్వకాలు, నిల్వలపై ఉన్నతధికారులు ఎలా స్పందిస్తారో? వేచి చూడాలి మరి.

ఇసుక తవ్వకాల నిలిపివేతకు ఆదేశాలిచ్చాం



సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కోటిపల్లి నుంచి మసకపల్లి వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో తవ్వకాలు నిలిపేయాలని సిబ్బందిని ఆదేశించాం. ఆర్ఐ నరాల వెంకట్రావు, సిబ్బందిని ఆయా ర్యాంపులకు పంపించి ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని సూచించాం. కూళ్ల గ్రామ పరిసరప్రాంతాల నుంచి ఇసుక రవాణా జరుగుతున్నట్టు సమాచారం ఉంది. కె.గంగవరం మండల పరిధిలో ప్రస్తుతం తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

-రవీంద్రనాథ్, తహశీల్దార్ కె.గంగవరం

ఎన్‌జిటి ఆదేశాల అమలు చేయాలి



గోదావరి పరివాహక ప్రాంతాన్ని పరిరక్షించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలి. రాష్ట్రంలో గోదావరి పర్యాటక ప్రాంతంలో పక్కనే ఉన్న ప్రాంతాల్లో అక్రమ ఇసుక తవ్వకాలు కొనసాగిస్తూ కోర్టు ఆదేశాలను పక్కన పెడుతున్నారు. ఇది పర్యావరణానికి పెనుముప్పు కానుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నా. కోర్టు ఆదేశాలను అధికారులు పాటించాలి. గోదావరి పరివాహ ప్రాంతంలో కొనసాగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా వెంటనే నిలిపివేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

-దోమ ఆదినారాయణ ,రాష్ట్ర మత్స్యకార శాఖ సంఘం నాయకులు, దంగేరు

4న షాక్ తగలబోయేది వైసిపికే : గన్ని

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జూన్ 4న దేశం యావత్తు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని చూడబోతుందని, ప్రజలు ఇచ్చిన షాక్ వైసిపికి తగలబోతుందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజల నాడిని తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నుంచి వైసిపి నాయకుల వరకు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ కేడర్ జారిపోకుండా ప్రయత్నిస్తున్నారన్నారు. లండన్ పర్యటనకు వెళ్తున్న జగన్ కడర్‌లో నిరుత్సాహం కలగకుండా ఐప్యాక్ టీమ్‌తో సమావేశమైనప్పుడు చెప్పిన విషయాలన్నీ ఓటమిని కప్పిపుచ్చుకోవడానికేనని పేర్కొన్నారు. అసమర్థత, అవినీతి వైసిపికి ప్రజలు ఎన్నికల్లో షాక్ ఇచ్చారని, ఎక్కడ చూసిన కూటమి ప్రభావం కనిపించిందన్నారు. ఓటమికి గల కారణాలను చిత్తశుద్ధితో ఒప్పుకోకుండా వైసిపి నాయకులు ముందుగా ఎన్నికల కమిషన్, పోలీసులపై నిందలు వేస్తున్నారన్నారు. వైసిపి వారి ఆటలు ఎన్నికల కమిషన్ దగ్గర సాగకపోవడంతో దాడులకు తెగబడ్డారని, హింసాత్మక ఘటనలకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే ఓటమిని తట్టుకోలేక దాడులతో పాటు వైసిపి నేతలు అంబటి రాంబాబు,పేర్ని నాని,బొత్స సత్యనారాయణ వంటి నాయకులు ఎన్నికల కమిషన్ తమకు వ్యతిరేకంగా పని చేస్తోందని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఓటమి బాధ తట్టుకోలేక వైసిపి గూండాయిజం చేస్తోందని, ఇప్పటికీ తెలుగుదేశం పార్టీకి ఓటు వేసిన వారిపై దాడులకు తెగబడుతున్నారన్నారు. ఇంకో 17 రోజుల్లో ఈ నాయకులను నడిరోడ్డుపై ప్రజలు పరుగులు పెట్టిస్తారని, ఇది ఖాయమని గన్ని కృష్ణ అన్నారు. బటన్ నొక్కి నెలలు కావస్తున్న ప్రజల ఖాతాల్లో డబ్బులు జమ చేయకుండా కాంట్రాక్టర్లకు రూ.1400 కోట్లు జమ చేసి పేదలపై పక్షపాతం చూపించారన్నారు.

2వ రోజుకు 'క్రియేటివ్' శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు క్రియేటివ్ ఈ కంటెంట్ జనరేషన్ విధానంపై ఇస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం నాటికి రెండవ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నిష్ణాతుల నుంచి నేర్చుకున్న అంశాలను అధ్యాపకులు వారి సబ్జెక్టుల్లో ఈ-కంటెంట్లను తయారు చేయడానికి ఉపయోగించి, దూరవిద్య ద్వారా చదువు కొనసాగిస్తున్న విద్యార్థులతో పాటు కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను చేరువ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తమ కళాశాల పాలుపంచుకోవడం తమకెంతో ఆనందాన్నిస్తుందని తెలియజేశారు. ఎడ్ జోన్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ నుంచి విచ్చేసిన డాక్టర్ రామ్‌కుమార్ ఎఐకు సంబంధించిన అనేక అంశాలను వివరించారు. వాటిని ఈ కంటెంట్ జనరేషన్లో ఎలా ఉపయోగించాలి అనే అంశంపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. డాక్టర్ హరినాథ్ శర్మ కృతిమ మేధస్సును ఉపయోగించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలాగా, ఆకర్షణీయంగా పాఠ్యాంశాలను ఎలా రూపొందించాలో వివరించారు. యూనిస్కిల్స్ ఇండియాకు చెందిన ప్రొఫెసర్ ప్రవీణ్‌కుమార్‌శర్మ పాడ్ కాస్టింగ్, ఆడియో ఎడిటింగ్‌పై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి బి.వెంకట్రావు సమన్వయకర్తగా ఎపిసిసిఇ విజయవాడ నుంచి వచ్చిన డాక్టర్ జె.జ్యోతి కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాల నుంచి 86 మంది అధ్యాపకులు హాజరయ్యారు. శ్రీ ఎన్. శ్రీనివాస్, సంజీవ్ కుమార్, దేవరాజ్ పాల్గొన్నారు.

నన్నయ అభివృద్ధికి న్యూయోమ్ సహకారం

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ అభివృద్ధికి న్యూయోమ్ సహకారారం అందించనుంది. ఈ మేరకు శుక్రవారం నన్నయ వర్శిటీ అధికారులతో బెంగళూరుకు చెందిన న్యూయోమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకుడు, సిఇఒ అండ్ ఎమ్‌డి డాక్టర్ వంగల రజనీకాంత్‌తో సమావేశమయ్యారు. నన్నయ్య యూనివర్సిటీ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం న్యూయోమ్‌తో సహకారంపై చర్చించారు. విసి ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ న్యూయోమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ బెంగళూరుతో విద్యార్థుల అభ్యాసన కార్యక్రమాలు, వ్యవస్థాపకత, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్‌ని వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, ఆరోగ్య సంరక్షణలో సమగ్రపరిచే ఆవిష్కరణల కోసం అత్యుత్తమ సెంటర్‌ను రూపొందించడంలో కలిసి పని చేయాల్సి ఉందన్నారు. విద్యార్థులకు సాధికారత కల్పించడం, మహిళా విద్యార్థులు పారిశ్రామికవేత్తలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. న్యూయోమ్ సహకారంతో యూనివర్సిటీ మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సిఇఒ డాక్టర్ వంగల రజనీకాంత్ గోదావరి జిల్లా వాసీ అవ్వడం గర్వకారణమన్నారు. అనంతరం ఆయన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆచార్య బి.జగన్మోహనరెడ్డి విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఇవిఎంలకు పటిష్ట భద్రత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

తూర్పు గోదావరి జిల్లాలో కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత, ఇవిఎంలు, వివిప్యాట్‌ల సురక్షిత తదితర అంశాలపై ఎస్‌పితో కలిసి కార్యాచరణ రూపొందించామని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారులు, ఐజిలు, డిఐజిలు, సిపిలు, ఎస్‌పిలతో రాష్ట్ర ఛీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల వారీగా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి ఎస్‌పి పి.జగదీష్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, డిఆర్ఒ జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఏడు అసెంబ్లీ, రాజమండ్రి పార్లమెంటు నియోజక వర్గాలకు సంబంధించి పోలింగైన బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వివి ప్యాట్స్ అత్యంత జాగ్రత్తగా భద్రపరిచామన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎన్నికల ప్రవర్తనా నియమావళి కాలంలో జరిగిన పోల్ హింసాత్మక సంఘటనలపై అదనపు సూచనలు చేశారు. రాజకీయ హింసకు సంబంధించిన ఏదైనా సంఘటనపై స్పందించే క్రమంలో ప్రజలు, మీడియా సంయమనం పాటించడం అత్యంత కీలకమైన అంశమన్నారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఇటువంటి ఘటనలు జరిగిన సందర్భంలో సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని, జిల్లా ఎన్నికల అధికారికి, ఎస్‌పిలకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు, ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్, మొబైల్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. సిసి కెమెరాల నిఘా పర్యవేక్షణలో నిరంతర చిత్రీకరణ, 24 గంటల పర్యవేక్షణ, మూడంచెల భద్రతతో కూడిన పహారా ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి తగిన ఏర్పాట్లపై ముందస్తు జాగ్రత్తలపై ఆర్ఒలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జూన్ 4న జిల్లాలో ఏడు నియోజక వర్గాల పరిధిలో ఓట్ల లెక్కింపు కోసం ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటిస్తామన్నారు. ఆ మేరకు రిటర్నింగ్ అధికారులు విధులు, బాధ్యతలపై సూచనలు చేశామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడు షిఫ్టుల్లో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గెజిటెడ్ అధికారులతో పర్యవేక్షణ చేపడుతున్నామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా పెట్టామన్నారు. ఒకటి రెండు సార్లు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు మేరకు స్ట్రాంగ్ రూమ్‌లో ఎటువంటి షార్ట్ సర్క్యూట్ జరుగకుండా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాలని అధికారులని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాట్లు, జూన్ 4న కౌంటింగ్ రోజున చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికాపై చర్చించామన్నారు. ఎన్నికల ప్రధాన అధికారి సూచనాలపై మరో సారి ఎస్‌పితో కలిసి సమీక్షిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ మాధవీలత

ఎస్‌పి పి.జగదీష్ మాట్లాడుతూ, నన్నయ్య యూనివర్సిటీ వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. సిఐ, డిఎస్‌పి, మొబైల్ టీమ్, సిఆర్‌పిఎఫ్, ఆర్మ్డ్ రిజర్వ్ ఫోర్సెస్, రాష్ట్ర పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లాలో జూన్ 4వ తేదీ వరకు ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా మతరపరమైన, రాజకీయ పరమైన సమావేశాలు నిర్వహించడం నిషేధం అన్నారు. ఈ సమావేశంలో రిటర్నింగ్ అధికారులు జెసి ఎన్.తేజ్ భరత్, అదనపు ఎస్‌పిలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దానవాయిపేట, చర్చిగేట్ ఫీడర్‌లైన్‌లలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపేయనున్నట్టు ఎపిఇపిడిసిఎల్ ఇఇ(ఆపరేషన్స్) నక్కపల్లి శామ్యూల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆనంద్ రీజెన్సీ రోడ్డు, పార్క్ బ్యాక్ సైడ్, యాక్సిస్ బ్యాంక్ రోడ్డు, చిన్న గాంధీ బొమ్మ, రవీంద్ర భారతి స్కూల్ ఏరియా, భాష్యం స్కూల్ ఏరియా, రౌండ్ పార్కు నుంచి ఎస్‌బిఐ రోడ్డు, ఎపెక్స్ హాస్పిటల్ రోడ్డు, నారాయణ కాలేజీ, ఎస్‌కెవిటి స్కూల్ రోడ్డు ఏరియాలో, సిసిసి చానల్ రోడ్డు ఏరియాలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

రక్తపోటును నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రక్తపోటు(హైపర్ టెన్షన్)పై ప్రతి ఒక్కరూ అవగాహనను కలిగి ఉండాలని పలువురు వైద్యులు సూచించారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని నిర్వహించారు. 'మీ రక్తపోటును కచ్చితంగా కొలవండి, అదుపులో పెట్టండి, ఎక్కువ కాలం జీవించండి!' అనే సందేశంతో ఈ ఏడాది రక్తపోటు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడారు. జిల్లాలో వివిధ ఆరోగ్య శిబిరాలు, అవగాహన సెషన్లు నగరంలో, విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో నిర్వహిస్తున్నామనానరు. రక్తపోటు కొలత పద్ధతులపై శిక్షణా కార్యక్రమాలు హైపర్‌టెన్షన్ నియంత్రణకు సంబంధించిన ఆహార మరియు జీవనశైలి మార్పులపై సదస్సులు, ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ధ్రువీకరించబడిన పరికరాలతో, సరైన పద్ధతులతో రక్తపోటును కొలవాలన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, ఉప్పు తగ్గించడం, నిత్యం వ్యాయామం చేయడం, బరువును కంట్రోల్‌లో ఉంచడం, ధూమ, మద్య పానాలకు దూరంగా ఉంటే రక్తపోటును చాలా వరకూ తగ్గించొచ్చన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడడం, అవసరమైతే డాక్టర్ సూచించిన ఔషధాలను వినియోగించాలన్నారు. జిల్లా ఎపిడిమియలజిస్ట్ సుధీర్ బాబు మాటాడుతూ జిల్లాలో మొత్తం 17,98,643 జనాభా ఉండగా 30 ఏళ్ల పైబడినవారు 11,69,017 మంది ఉన్నారన్నారు. వీరిలో 83శాతం స్క్రీనింగ్ జరిగిందన్నారు. 1,15,715 మందిలో రక్తపోటు ఉన్నట్టు గుర్తించామన్నారు. వారిలో 93,984 (81.22శాతం) మందికి ఉచితంగా వైద్యం అందిస్తున్నామన్నారు. ఈ నెలఖరున మోడో దశ స్క్రీనింగ్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌డిసి ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్రప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మౌనిక, డెమో డాక్టర్ సత్యకుమార్ నల్లూరి, స్టాటిస్టిక్స్ ఆఫీసర్ కుమార్ స్వామి, సూపర్‌వైజర్లు జాన్సన్ రాజు, బి.రాజు, అలీ బేగ్, సత్యనారాయణ, ఆఫీసు సూపరింటెండెంట్ కెవివి.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లజర్ల : హైబీపి ని తక్కువగా అంచనా వేయకూడదని నిర్లక్ష్యంగా ఉంటే ఒక్కోసారి ప్రాణానికే ప్రమాదమని నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ తెల్లం గంగాధరరావు అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆసుపత్రి ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలనొప్పి, తలతిరగడం, ఛాతినొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, వికారం, వాంతులు, దృష్టి మసకబారడం, ఆందోళనగా ఉండటం, చెవుల్లో శబ్దాలు వంటివి హైపర్ టెన్షన్‌కు సూచనలన్నారు. వ్యాయామం, ఆహారంలో ఉప్పు, కారాలు తగ్గించడం, దుమపానం, మద్యపానం మానేయడం వంటివి హైబీపి నియంత్రణకు ఉపకరిస్తాయన్నారు. రక్తపోటు దినోత్సవం పురస్కరించుకొని ఆసుపత్రికి వచ్చిన వారందరికీ రక్తపోటుపై వైద్య పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ పలివెల ప్రసాదరావు, పర్యవేక్షకులు అన్నమ్మ, సత్యనారాయణ, ఆసుపత్రి ఉద్యోగులు పాల్గొన్నారు.



27 నుంచి టైలరింగ్‌లో శిక్షణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం రూరల్ ఆల్కట్ గార్డెన్స్‌లోని యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 27 నుంచి మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ అవకాశం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మహిళలకు మాత్రమేనని చెప్పారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఏడో తరగతి చదివి, తెల్ల రేషన్ కార్డు కలిగిన 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.రిజిస్ట్రేషన్ కోసం 0883- 2420242, 9440414910, 966832144 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.



వనమహోత్సవంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వనమహోత్సవం

ప్రజాశక్తి - కొవ్వూరు

జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా దొమ్మేరులో మొదటి రోజు వనమహోత్సవాన్ని నిర్వహించారు. సచివాలయం, ప్రభుత్వ పాఠశాల, రైతు భరోసా కేంద్రం ప్రాంగణంలో జామ, కొబ్బరి, నిమ్మ, ఉసిరి, నేరేడు, వేప మొక్కలను నాటారని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.వి.రమణమూర్తి తెలిపారు. శుక్రవారం కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల రాజమహేంద్రవరం విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కెవి.రమణమూర్తి మాట్లాడుతూ గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఏడు రోజులపాటు నిర్వహించనున్నామన్నారు. మొదటి రోజు వనమహోత్సవం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. తదుపరి ఈ పథకం యొక్క ప్రాముఖ్యత,సేవా కార్యక్రమాలు గురించి వివరించారు. జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ కెఎం.దక్షిణమూర్తి, డాక్టర్ సిఎచ్.సునీత అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్స్ డాక్టర్ ఎస్‌వి.భవానీప్రసాద్, డాక్టర్ టి.ఉషారాణి, డాక్టర్ కె.రవికుమార్, సర్పంచ్ టి.కుమారి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రెసిడెంట్ సూర్యనారాయణరాజు, పంచాయతీ సెక్రటరీ లక్ష్మి, దొమ్మేరు గ్రామస్తులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో ప్రభుత్వ వ్యవస్థలు నిర్వీర్యం

ప్రజాశక్తి - రాజానగరం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హయాంలో ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాజానగరం సమీపంలో గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్‌టియు రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దీనికి రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు భారీగా జరిగిందన్నారు. అభ్యర్థుల ఇళ్లకు ఓటర్ల వెళ్లి డబ్బులు అడగడం అప్రజాస్వామికం అన్నారు. సామాన్య మధ్య తరగతి ప్రజలు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేదన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రభుత్వ యంత్రాంగాన్ని కాలు కింద చెప్పులా అణిచి వేశారన్నారు. ప్రభుత్వం మారుతుందని ఆశిస్తున్నమన్నారు. రాయలసీమలో వైసిపికి కొన్ని సీట్లు మాత్రం వస్తాయన్నారు. రాష్ట్రంలో కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసినా ప్రజలకు ఉపయోగపడలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ఎం.రఘునాథ్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె. కోటేశ్వరరావు, జి. నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


ఘటనా స్థలంలో మృతి చెందిన నాగరాజు

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి-ఆలమూరు

216వ నెంబర్ జాతీయ రహదారిపై మండలంలోని మూలస్థాన అగ్రహారం డివైడర్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఆత్రేయపురం మండలం ర్యాలీకి చెందిన బర్రె నాగరాజు (25) ద్విచక్ర వాహనంపై రావులపాలెం వైపు నుంచి మూలస్థాన అగ్రహారం ఇందిరా కాలనీకి వస్తున్నాడు. ఈ క్రమంలో మూలస్థాన అగ్రహారం వద్ద డివైడర్ దాటుతున్నాడు. ఇంతలో రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలైన నాగరాజు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జనసేన పార్టీ కార్యాలయంలో ఫర్నీచర్ అపహరణ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం జనసేన పార్టీ కార్యాలయంలో ఫర్నీచర్‌ను ముగ్గురు వ్యక్తులు దొంగలించిపోయారని ఆ భవన యజమానులు చొడపనీడి బాలకృష్ణ, చొడపనీడి చక్రధర్ రావు శుక్రవారం ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని టిటిఆర్ నగర్‌లోని తమకు చెందిన ఖాళీ స్థలంలో జనసేన పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకునేందుకు 2019 జనవరి 21వ తేదీన సిహెచ్ గున్నేపల్లి గ్రామానికి చెందిన గొల్లకోటి వెంకటేశ్వరరావు ఒక సంవత్సర కాలానికి లీజు ఒప్పందం కుదుర్చుకున్నాడని, అయితే వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందాడని, అప్పటినుండి తమకు ఏ విధమైన అద్దె చెల్లించడం లేదన్నారు. 15వ తేదీ బుధవారం రాత్రి ముగ్గురు వ్యక్తులు కార్యాలయంలోని కుర్చీలు, ఏసీలు, బల్లలు, ఫ్యాన్లు మరియు ఇతర సామగ్రిని దొంగలించుకుపోయారని దీనిపై విచారణ నిర్వహించి దొంగతనానికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.


అచీవర్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు

'ఆదిత్య'లో ఘనంగా ఎచీవర్స్ డే

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య విద్యా ప్రాంగణంలో 2023-24 విద్యా సంవత్సరంలో ఫైనల్ ఇయర్ పాలిటెక్నిక్ చదువుతుండగానే వివిధ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ సాధించిన అన్ని బ్రాంచ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదిత్య కళాశాలల ప్రిన్సిపల్ ఎస్‌టివిఎస్.కుమార్ మాట్లాడుతూ ఆదిత్య పాలిటెక్నిక్‌లో చేరిన ప్రతి విద్యార్థి కోర్స్ ముగిసే నాటికి పాలిటెక్నిక్ సర్టిఫికెట్‌తో పాటు ఒక చేతిలో 2 లేదా 3 కంపెనీలలో ఉద్యోగం, మరో చేతిలో మంచి ఈసెట్ ర్యాంకుతో బయటకు వెళ్ళాలనేది తమ లక్ష్యమన్నారు. దాన్ని నిజం చేస్తూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా థాట్ వర్క్, ఎబిబి, హిందూజా, వంటి 15 పైగా ప్రముఖ బహుళజాతి కంపెనీలలో ఇప్పటి వరకు దాదాపు 600 మంది విద్యార్థులు రూ.8 లక్షలు, రూ.4.75 లక్షల వార్షిక వేతనం గల ఉద్యగాలు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చివరిగా ఉద్యోగాలు సాదించిన ప్రతి బ్రాంచ్ విద్యార్థులకు ప్లేసెమెంట్ ఉత్తర్వుతో పాటు సర్టిఫికెట్ బహుకరించారు. ఈ సమావేశంలో డీన్ ఎవి.మాధవరావు, వివిధ విభాగాధిపతులు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.


వార్డులో తవ్వి వదిలేసిన గోతులు

ప్రమాదకరంగా పైప్ లైన్ గోతులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణ పరిధిలోని 23వ వార్డులో మంచినీటి పైప్ లైన్లు మరమ్మతుల కోసం తవ్విన గోతులను పూడ్చకుండా వదిలేశారు. ఇక్కడ గల గుండప్ప వారి సందు ఎదురుగా మునిసిపాలిటీ తాగునీటి విభాగం మంచి నీటి పైపులైన్ మరమ్మతుల నిమిత్తంగా గొయ్యి తవ్వారు. దాదాపుగా పది రోజులు అయినా పైపులై ను మరమ్మతు పూర్తి చేయలేదు. దీనితో నీరు లీక్ అవుతూనే ఉంది. రోడ్డు పక్కనే ఉన్న ఈ గొయ్యి నిత్యం వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉండే దారిలో ఇబ్బందికరంగా ఉంది. పక్కనే ఉన్న డ్రయినేజీ నీళ్ల ఆ గోతిలోకి వెళుతున్నాయి ఆ నీళ్లే లీకేజీ ద్వారా మంచినీటి పైపుల నుండి ఇళ్లకు కూడా వెళుతున్నాయనీ, సంబంధిత అధికారులు మున్సిపల్ కమిషనర్ ఈ విషయంపై దష్టి సారించి సమస్యను పరిష్కరించాలని వార్డు ప్రజలు కోరు తున్నారు.

నత్తనడకన ఫ్లయ్ ఓవర్ నిర్మాణం

- జొన్నాడ ఫ్లయ్ ఓవర్ నిర్మాణం
- పనులతో తరచూ ప్రమాదాలు
- ప్రయాణికులకు నిత్యం యాతన
- పట్టించుకోని హైవే అధికారులు


జొన్నాడ సెంటర్ ఫ్లైఓవర్ నిర్మాణ దశలో ఉన్న పిల్లర్లు

ప్రజాశక్తి - ఆలమూరు

216ఏ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు, తద్వారా ప్రయాణికుల ఇబ్బందుల పరిష్కారానికి అధికారులు పలుచోట్ల ఫయ్ ఓవర్ నిర్మాణాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లోని మోరంపూడి వద్ద, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని జొన్నాడ వద్ద ఫ్లయ్ ఓవర్ల నిర్మాణానికి గత ఏడాది జనవరిలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. వచ్చే ఏడాది జనవరికి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన ప్రకటించారు. ఈ రెండింటిలో మోరంపూడి వద్ద పనులు శరవేగంగా జరుగుతు దాదాపుగా ఫ్లయ్ ఓవర్ నిర్మాణం పూర్తి కాగా, అప్రోచ్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో మోరంపూడి ఫ్లయ్ ఓవర్ రెండు, మూడు నెలల్లో అందుబాటులోకి రానుంది.

కానీ ఆలమూరు మండలంలోని జొన్నాడ వద్ద ఫ్లయ్ ఓవర్ పనులు ప్రారంభించినప్పటికీ, గుత్తేదారు అలసత్వంతో నత్తనడకన కొనసాగుతున్నాయి. రెండు ఫ్లయ్ ఓవర్ల వద్ద పనులు బేరీజు వేసుకుంటే మోరంపూడి వద్ద పనులు పూర్తి కావస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కానీ జొన్నాడ వద్ద ఇంకా పిల్లర్లే పూర్తిగా అని పరిస్థితి నెలకొంది. ఈ జొన్నాడ ఫ్లయ్ ఓవర్ పై ఎందుకంత వివక్ష చూపుతున్నారో అర్థం కావడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనులతో గత ఏడాదిన్నరగా జొన్నాడ సెంటర్ వద్ద ప్రమాదాలకు నిలయంగా మారింది. ఫ్లయ్ ఓవర్ పనుల పేరుతో ఎటువంటి నియమ, నిబంధనలు పాటించకుండా వదిలేయడంతో తరచు అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో పలువురు మత్యువాత పడగా, అనేకమంది క్షతగాత్రులుగా మిగులుతున్నారు. అయినప్పటికీ హైవే అధికారులు నిర్లక్ష్య ధోరణిలో ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదు. డివైడర్ దాటే క్రమంలో రోడ్డు ఒక పక్క నుంచి మరొక పక్కకు వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఇక పిల్లర్ల నిర్మాణానికి ఏడాది పట్టిందంటే మిగిలిన పనులు ఎంత నత్తనడకన సాగనున్నాయో అర్థం చేసుకోవచ్చునని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలమూరు మండలంలోని అనేక గ్రామాల వారికి జొన్నాడ సెంటర్ ముఖ్య కూడలి. నిత్యం వందలాదిమంది ఇక్కడకు చేరుకొని రాజమహేంద్రవరం, విజయవాడ తదితర దూర ప్రాంతాలకు ప్రయాణిస్తూ ఉంటారు. కనీసం ప్రయాణికులకు బస్సు షెల్టర్ కూడా ఏర్పాటు చేయలేదు. నిర్మాణం పేరు చెప్పి ఉన్న బస్సు షెల్టర్లు పూర్తిగా తొలగించి సర్వీసు రోడ్డు వేశారు. దీంతో సుమారు 15 నెలలుగా ప్రయాణికులు ఎండైనా, వానైనా బస్సుల కోసం రోడ్డు మీదే నిరీక్షించాల్సి వస్తోంది. ఇక సర్వీసు రోడ్డుపై ట్రాఫిక్ ఇబ్బందులతో బస్సులను ఎక్కడ ఆపుతున్నారో ప్రయాణికులకు అర్థం కావడం లేదు.

దీంతో వృద్ధులు, వికలాంగులు, మహిళలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. జొన్నాడ సెంటర్ వద్ద పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే హైవే అధికారులు సోజ్యం చూస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


నత్తనడకన సాగుతున్న అప్రోచ్ రోడ్డు పనులు

నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి



అనునిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే జొన్నాడ సెంటర్ వద్ద ఫ్లయ్ ఓవర్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. మా తోటి ప్రయాణికులు ఇప్పటికే పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. ఇకనైనా అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేసేందుకు చొరవ చూపాలని కోరుతున్నా.

-రాయుడు వెంకటేష్, చెముడులంక

నియంత్రణ లేని ట్రాఫిక్‌తో ప్రమాదాలు



జొన్నాడ సెంటర్ వద్ద ఫ్లయ్ ఓవర్ నిర్మాణ పనుల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు సరైన సూచికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత గుత్తేదారుతో సమీక్ష నిర్వహించి, పనులు పూర్తయ్యేందుకు తక్షణ చర్యలు తీసుకుని, ప్రయాణికుల అవస్థలకు అడ్డుకట్ట వేయాలి. ఇకనైనా హైవే అధికారులు స్పందించి ఫ్లయ్ ఓవర్ నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలి.

-దూలం రాంబాబు, బడుగువానిలంక

సాదా సీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి-గండేపల్లి

మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ హనుమంతరావు ఆధ్వర్యంలో ఎంపిపి చలగళ్ల దొరబాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా, జెడ్‌పిటిసి సభ్యులు పరిమి వెంకట లక్ష్మీ బాబు, వైస్ ఎంపిపి పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న అధికారులతో సమస్యలు చెప్పమని తెలపడంతో ఎక్కువగా ఆయా మండల కార్యాలయాలకు సంబంధించిన ప్రహరీ గోడ తదితరు సమస్యలను మండల స్థాయి అధికారులు వివరించారు. ఉప్పలపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ అడబాల ఆంజనేయులు మాట్లాడుతూ తమ గ్రామంలో తాగునీరు బోరు పాడైందని వెంటనే రిపేరు చేయించాలని కోరారు. మురారి గ్రామానికి సంబంధించి ఎంపిటిసి సభ్యురాలు మాట్లాడుతూ తమ గ్రామంలో ఐసిడిఎస్ బాలింతలకు ఇవ్వాల్సిన పౌష్టికాహారాలు సంబంధించిన సమస్యలు లేవనెత్తారు. సిడిపిఒ అధికారి పూర్ణిమ ఆ సమస్యను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ ఉన్నందున తీర్మానాలు చేయడం జరగదని ప్రస్తుతం సమస్యలపై సమీక్ష నిర్వహిస్తామని ఎంపిడిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బిఎస్ఎన్.మూర్తి, ఆయా గ్రామ సర్పంచులు అడబాల ఆంజనేయులు, జాస్తి వసంత్, మద్దిపట్ల రామకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిఎస్ఎన్ మూర్తి

19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

ప్రజాశక్తి-కాకినాడ

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, పీడిత ప్రజల ప్రియతమ నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి ఈ నెల 19న ఆదివారం ఉదయం 9 గంటలకు కాకినాడ కచేరిపేట సుందరయ్య భవన్‌లో నిర్వహిస్తామనిసిపిఎం నగర కమిటీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం సిపిఎం నగర కమిటీ సభ్యులు కె.సత్తిరాజు మాట్లాడుతూ సుందరయ్య జీవితంలో ఉద్యమం, పోరాటం, త్యాగంతో పాటు నిరంతరం ప్రజా సేవ కూడా ముడిపడి ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో ఆయన వర్ధంతి సందర్భంగా ఉన్నంతలో సాయం ఉన్నంత వరకు చేద్దాం అనే కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. నగరంలో ఎవరైనా తమ ఇళ్లలో ఉపయోగించని, అవసరానికి మించి అదనంగా ఉన్నవి ఏవైనా దుస్తులు, గిన్నెలు, పుస్తకాలు, ఇతర వస్తువులు 18వ తేదీ సాయంత్రం లోపు కచేరిపేట సుందరయ్య భవన్‌లో అందించాలని కోరారు. 19వ తేదీ ఉదయం సుందరయ్య వర్ధంతి సందర్భంగా వాటిని అవసరమైన వారికి అందచేస్తామన్నారు. వివరాలకు 9490098974 నెంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.సత్తిరాజుతో పాటు సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యుడు మలక వెంకట రమణ పాల్గొన్నారు.



దుస్తులను సేకరిస్తున్న సిపిఎం నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి హనుమంతరావు

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

ప్రజాశక్తి-పిఠాపురం

గ్రామంలో శాంతి భద్రతలకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని డిఎస్‌పి కె.హనుమంతరావు అన్నారు. శుక్రవారం మండలంలోని విరవాడ గ్రామంలో గ్రామ పెద్దలు, యువత, పలు పార్టీల కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజున విరవాడ గ్రామంలోని జరిగిన చిన్న చిన్న గొడవల నేపథ్యంలో శాంతిభద్రతలకు భంగం కలిగించకుండా గ్రామంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కౌంటింగ్ కూడా ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని కోరారు. సెక్షన్ 144, 30 పోలీస్ యాక్ట్, ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున గుంపులు గుంపులుగా తిరగరాదని, సమావేశాలు కానీ, సభలు ఏర్పాటు చేయరాదన్నారు. కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు పర్మిషన్ లేకుండా నిర్వహించరాదన్నారు. గతంలో ఎన్నికల కేసులు ఉన్న వ్యక్తులను, లా అండ్ ఆర్డర్ కేసుల్లో ఉన్న వ్యక్తులను బైండోవర్ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో కలిగి ఉండాలని విద్యార్థులు మంచిగా చదువుకొని తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు ప్రతిష్ట తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో సిఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ గుణశేఖర్, పట్టణ ఎస్ఐ మురళి మోహన్ పాల్గొన్నారు.

'అపోలో' ఆధ్వర్యంలో నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక డీ కన్వెంక్షన్ హాల్లో కాకినాడ అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో నర్సుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహిచారు. దీనికి ముఖ్య అధిదిగా అపోలో హాస్పిటల్స్ రీజినల్, ఇంటెర్నేల్టిన్ సిఇఒ వై.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. లేడి విత్ ది లాంప్ గా పేరు గాంచిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని నర్సెస్ డే గా ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు. ఈ సంవత్సరం నర్సెస్ డే యొక్క నేపథ్యం ఏమనగా మా నర్సులు మా భవిష్యత్తు ఈ నేపథ్యాన్ని పురస్కరించుకొని అపోలో హాస్పిటల్స్ కాకినాడ వారు నర్సెస్ డే ని నిర్వహించారు. ఈ కార్యక్రమాంలో సిఇఒ వై. సుబ్రమణ్యం మాట్లాడుతూ నర్సులు ఆసుపత్రులకు వెన్నెముక లాంటి వారని పేర్కొన్నారు. ఏ ఆసుపత్రిలో అయినా నర్సులు ముఖ్య పాత్ర వహిస్తారన్నారు. వారు తమ ముఖంలో చిరునవ్వు చెక్కు చెదరకుండా అనారోగ్య సమసమ్యతో వచ్చిన వారందరికీ సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఒక్క రోగి ఆసుపత్రికి రోగనివారణ కోసం వచ్చినపుడు వారిని జాగ్రతగా చేసుకుంటూ రోగికి కావలసిన మందులు, ఆహారం ఇవ్వడం, సమయాను కూలంగా అవసరమైన సేవలు నర్సులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ హెడ్ ఐవి. రమణ మాట్లాడుతూ రోగులకు వైద్యులు ఇచ్చే ఔషధం ఎంత ముఖ్యమో, నర్సులు చేసే సేవలు కూడా అంతే ముఖ్యమన్నారు. రోగులే తమ పిల్లలుగా భావిస్తూ నర్సులు సేవలు అందిస్తారన్నారు. అటు డాక్టర్లకు, ఇటు రోగులకు వాళ్లు నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. ఆస్పత్రుల్లో నర్సులు చేసే పని ఎంతో కీలకమైనదన్నారు.


కేకును కట్ చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

తాండవపై వంతెన కోసం నిరీక్షణ

ప్రజాశక్తి-కోటనందూరు

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నప్పటికీ తాండవ నదిపై వంతెన కోసం నిరీక్షణ తప్పడం లేదు. మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో తుని రూరల్, కోటనందూరు మండలాల రైతుల ఆశలు ఆవిరిగానే మిగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం హామీలు ఇస్తున్న ఆ హామీలు నీటి మీద బుడగగానే మిగిలిపోతున్నాయని విచారం వ్యక్తం చేస్తున్నారు. బొద్దవరం, సుభద్రయమ్మపేట, కెఒ.అగ్రహారం, కొలిమేరు, సురవరంలో సుమారు 2,290 మంది రైతులు ఉన్నారు. వీరంతా చిన్నకారు రైతులు ఆయా గ్రామాల్లో 5,500 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పచ్చిమిర్చి వంకాయలు, కాయగూరలతో పాటు వాణిజ్య పంటలైన అరటి, చెరకు, పామాయిల్, పంటలను సాగు చేస్తూ జీవనాన్ని సాగిస్తారు. వీరు వ్యవసాయం చేయడానికి తాండవ రిజర్వాయర్ నది దాటుకుని వెళ్ళాలి. ఈ నదిపై బ్రిడ్జి నిర్మించాలని 30 ఏళ్ల నుంచి ప్రజా ప్రతినిధులను, అధికారులను, నాయకులను అడుగుతున్నా బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడం లేదన్నారు. 30 ఏళ్ల నుంచి పలుమార్లు జిల్లా కలెక్టర్లకు, మంత్రులకు వినతిపత్రాలు అందజేసినా బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడం లేదన్నారు. 2023లో మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి, కాకినాడ ఎంపీ వంగ గీతకి విన్నవించుకోగా వెంటనే స్పందించి అప్పటి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు రూ.10 కోట్లతో నిర్మాణానికి అంచనాలు రూపొందించారని స్థానిక సర్పంచ్ వేగి అప్పల నాయుడు తెలిపారు. నేటి వరకు నిర్మాణ పనులను ప్రారంభించకపోవడంపై స్థానిక రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కష్టపడి పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకుని వెళ్లడానికి సరైన దారి మార్గం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు అన్నారు. తాండవ రిజర్వాయర్‌ను దాటుకుని వెళ్లలేక పామాయిల్, చెరుకు, పంటలను సాగు చేయడం మానేశామన్న రైతులు తెలిపారు. యడ్ల బళ్లు, ట్రాక్టర్లతో నదిని దాటుకుని వెళ్లే దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి తాండవ రిజర్వాయర్ నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


తాండవ నదిపై తాటి చెట్టుతో రైతులు వేసుకున్న వంతెన

స్ట్రాంగ్ రూమ్ సందర్శించిన ఆర్ఒ

కాకినాడ : కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు శుక్రవారం జెఎన్‌టియుకె సివిల్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎఆర్ఒ చెల్లన్న దొర ఇతర అధికారులతో కలిసి స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లిన ఆయన అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవిఎంలకు మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. నిరంతరం పర్యవేక్షించేలా ఇద్దరు అధికారులను నియమించామని ఆర్ఒ తెలిపారు.